

# హైదరాబాద్ వార్త

**ఎయిర్‌పోర్టు మెట్రో కారిడార్ హైలెట్స్**

**పొడవు: 31 కిలోమీటర్లు**
**ఎలివేటెడ్ వే: 27.5 కిలోమీటర్లు**
**రోడ్ వే: 1 కిలోమీటర్**
**అండర్ గ్రౌండ్ వే: 2.5 కిలోమీటర్లు**
**వేగం: గరిష్టంగా 120 కిలోమీటర్లు**
**ఫ్రీక్వెన్సీ: 2.5 నిమిషాలు (పీక్ అవర్స్)**
**సమయం: 26 నిమిషాలు**
**స్టేషన్లు 8 లేదా 9 (ప్రతిపాదన ప్రకారం)**
**ప్రారంభం: రాయదుర్గం టెర్మినల్ (నూతనంగా)**
**నిర్మాణం సమయం : 36 నెలలు**
**అంచనా వ్యయం: 6,250 కోట్లు**

## రాయదుర్గం-శంషాబాద్ మెట్రోకు పెన్ మార్కింగ్ సర్వే పూర్తి




హైదరాబాద్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : శంషాబాద్ ఎయిర్‌పోర్టు వకు మెట్రోరైలు కోసం పెన్ మార్కింగ్ సర్వే పూర్తయింది. రాయ దుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు మెట్రో రైలు కోసం 2022 డిసెంబరులో ముఖ్యమంత్రి కెసిఆర్ భూమి పూజ చేశారు. శంషాబాద్ ఎయిర్ పోర్టు మెట్రో మార్గంలో సర్వే చేసిన అధికారులు సూచక బోర్డులు ఏర్పాటు చేశారు. ఆ మార్గంలో ప్రతి 100 మీటర్లకు, అర కిలోమీటరుకు బోర్డులు ఏర్పాటు చేశారు. రాయదుర్గం నుంచి బయోడై వర్సిటీ జంక్షన్ వరకు, ఖాజాగూడ రోడ్డులోని ఐటీ టవర్స్ నుంచి నానక్‌రాంగూడ జంక్షన్ వరకు మార్కింగ్, నానక్‌రాంగూడ జంక్షన్ నుంచి అప్ప జంక్షన్ వరకు మార్కింగ్ చేసినట్లు మెట్రో ఎండి ఎన్వీఎస్‌రెడ్డి వెల్లడించారు.

## తెలుగు వర్సిటి యువ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

సైఫాబాద్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, రంగస్థల కళల శాఖ ప్రతి ఏడాది మార్చి 27వ తేదీన ప్రపంచ రంగ స్థల దినోత్సవం జరుపుతున్నదని, ఇందులో భాగంగా జె.ఎల్.నర్సింహారావు పేరు మీద యువ పురస్కార ప్రదానోత్సవం జరుగుతుందని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ తెలిపారు. నాటక రంగంలో వివిధ రంగాలలో అంటే నటన, దర్శకత్వం, మేకప్, లైటింగ్, సెట్ ఇంకా ఇతర సాంకేతిక అంశాలలో కృషి చేసిన 35 సంవత్సరాలలోపు యువతీ యువకులు ఈ పురస్కారాలకు అర్హులని తెలిపారు. ఈ పురస్కారాల కోసం రిజిస్ట్రార్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంకు పోస్టు ద్వారా గాని స్వయంగా గాని సంబంధిత వివరాలతో మార్చి 10వ తేదీలోగా దరఖాస్తులు పంపాలని ఆయన కోరారు. గతంలో ఫి బ్రవరి 26వ తేదీ వరకు మాత్రమే గడువు ఇచ్చామని దీనిని మార్చి 10కి పెంచామని తెలిపారు

## మద్యం మత్తులో యువకుడి వీరంగం

**తాను హైకోర్టు లాయర్‌నంటూ దుర్భాషలు**

**ఎస్సైని తన్నిన సదరు యువకుడిపై కేసు నమోదు**

హైదరాబాద్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త: బంజారా హిల్స్‌లో మద్యం మత్తులో ఓయువకుడు వీరంగం సృష్టించాడు. బ్రీత్ అనలైజ్ పరీక్షల్లో 94 పాయింట్లు రావడంతో ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో సదరు యువకుడు రెచ్చిపోయాడు. "నువ్వు ఏం సంపాదిస్తున్నావా? నేను నెలకు రూ.70వేలు సంపాదిస్తున్నా "అంటూ ట్రాఫిక్ ఎస్సైపై పెద్దఎత్తున ఎగిరాడు. అంతేకాదు ..మద్యం మత్తులో ఏం మాట్లాడుతున్నాడో కూడా తెలియక ఇష్టానుసారంగా రెచ్చిపోయాడు. ట్రాఫిక్ ఎస్సైమీద దూర్భషలు ఆడుతూ తను హైకోర్టు లాయర్‌నని ..తనకు హైకోర్టు జడ్జి తెలుసు అంటూ కోపంతో ఊగిపోయాడు. "నీకు సెక్షన్లు తెలుసా ? ఐపిసి సెక్షన్ 123 కింద నీపై కేసు ఫైల్ చేస్తా "అంటూ సదరు యువకుడు ఎస్సైని కాలితో తన్నాడు. అలాగే ఆయువకుడి పక్కన ఉన్న యువతి సైతం ఎక్కడా తగ్గలేదు. వీడియోలు తీస్తారా ? మీకు సిగ్గులేదా ?అంటూ రెచ్చిపోయింది. అయితే పోలీసులపై ఆస్థాయిలో రెచ్చిపోయిన యువకుడిని ఆహాఓటిటిలో పనిచేస్తున్న గౌరవ్‌గా గుర్తించారు.

## ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు



సికింద్రాబాద్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: చిలకలగూడలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా జరిగాయి. ముందుగా కరెస్పాండెంట్ కమటం రఘు జ్యోతీ ప్రజ్వలన చేసి వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించారు. విద్యార్థిని, విద్యార్థులు తమ ఆటపాటలతో హోరెత్తించారు. పలు సాంస్కృతిక కార్యాక్రమాలను నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యాక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, ఉపాధ్యాయులు అనిత, సౌజన్యరాణి, శ్రీనివాస్‌రెడ్డి, జగదేవి, నళిని, కృష్ణదత్త, ఇందిరా పాల్గొన్నారు.

## ఐసిఎఆర్ నార్మ్‌లో జాతీయ సైన్సుడే వేడుకలు




మాట్లాడుతున్న ఐసిఎఆర్-నార్మ్ డైరెక్టర్ డా.సి.హెచ్.శ్రీనివాస్‌రావు

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : రాజేంద్రనగర్‌లోని ఐసిఎఆర్-నార్మ్‌లో మంగళవారం జాతీయ సైన్సు వేడకలు జరిగాయి. ఈ సందర్భంగా ఐసిఎఆర్-నార్మ్ డైరెక్టర్ డాక్టర్. సి.హెచ్.శ్రీనివాస్ రావు విద్యార్దులకు దశాబ్దాలుగా వివిధ రంగాలలో దేశం అభివృద్ధి సాధించటానికి కారుకులైన ఆదర్శప్రాయ శాస్త్రవేత్తలు,వారి శాస్త్రీయ కృషి గురించి విపులంగా వివరించారు. నార్మ్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్.జి. వెంకటేశ్వర్లు, శంషాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఉమామహేశ్వరి, నార్మ్ ఎసిటిఒ డాక్టర్. లక్ష్మణ్ అహీర్,డాక్టర్ కీర్తి రంజన్ బరాల్, సిటిఒ అనిజ శంషాబాద్ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్దులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ర్యాగింగ్ భూతం.. తరిమికొట్టాల్సిందే

**గ్రేటర్‌లో పెరుగుతున్న ఈవ్‌టీజింగ్ కేసులు**

**స్కూళ్లు, కాలేజీల్లో రెచ్చిపోతున్న ఆకతాయిలు**

**బాలికలు, విద్యార్థినీల పట్ల వికృత చేష్టలు**

**ఉపాధ్యాయులు, పోలీసులు అవగాహన కల్పిస్తేనే మేలు**



హైదరాబాద్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త: గతంలో కాలేజీల్లో ర్యాగింగ్ భూతం ఎక్కువగా ఉండేది. కానీ చట్టంలోని శిక్షలు, విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమాలతో కొంతమేర తగ్గింది. కానీ అక్కడక్కడ వికృత రూపం దాల్చుతుంది. వరంగల్ కేయూ పిజీ వైద్యవిద్యార్థి డాక్టర్ ధారావత్ ప్రీతినాయక్ సీనియర్ వేధింపులకు బలయ్యారు. ఈనేపథ్యంలో ర్యాగింగ్ భూతంపై మళ్ళీ చర్చ మొదలైంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అనేక పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఇంజనీరింగ్,డిగ్రీ, ఫార్మసీ, మెడికల్ కాలేజీలు ఉన్నాయి. పలు కాలేజీల్లో ఇప్పటికీ అడపాదడపా ర్యాగింగ్ కేసులు బయటపడుతున్నాయి. అమ్మాయిలను వేధించడం, జూనియర్ విద్యార్థులను బంధించడం, వారితో పనులు చేయించుకోవడం వంటి సంఘటనలు బయటకు పొక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో వరంగల్ ఘటన లాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అందుకు ర్యాగింగ్ వల్ల కలిగే దుష్పరిణామాల గురించి విద్యార్థులు ,వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు విద్యాసంస్థలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని పలువురు విద్యారంగ నిపుణులు పేర్కొంటున్నారు. సమస్య తీవ్రత దానికి సంబంధించిన శిక్షలు, జరిమానాలను వివరించి ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా కఠినమైన నిబంధనలు ప్రవేశపెట్టి వాటి గురించి విద్యార్థులకు స్పష్టంగా తెలియజేయాలని పేర్కొంటున్నారు.

శిక్షలు ఇలా.. రాఘవన్ కమిటీ సిఫారసులు, యూజిసి, ఏఐసిటీఈ మార్గదర్శకాలు, సుప్రీంకోర్టు ఉత్తర్వులు ర్యాగింగ్ నిరోధక చట్టం,తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం ఏవిద్యార్థి అయినా ర్యాగింగ్‌కు పాల్పడినా.. ప్రోత్సహించినా.. సహకరించినా ర్యాగింగ్ వ్యతిరేక చట్టం ప్రకారం శిక్షలు పడతాయి. ర్యాగింగ్ పాల్పిడిన విద్యార్థులకు పదిసంవత్సరాల వరకు కఠిన కారాగార శిక్ష విధిస్తారు. అలాగే సంబంధిత విద్యార్థి అడ్మిషన్ రద్దు చేసి కాలేజీనుంచి బహిష్కరిస్తారు. మరే ఇతర కళాశాలలో చేరే అవకాశం లేకుండా చేస్తారు.




**కళాశాలల స్థాయిలో ఇలాచేయాలి..**

తొలుత విద్యార్థుల స్థాయిలో కమిటీ ఏర్పాటు చేయాలి. ఆతర్వాత ప్రత్యేకంగా స్క్వాడ్‌ను నియమించాలి. ఇందులో ఉపాధ్యాయుల తోపాటు అన్ని విభాగాల అధిపతులను భాగస్వామ్యం చేయాలి. కాలేజీ ప్రారంభం కాగానే ఫస్ట్ఇయర్ విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన కల్పించాలి. సెకండ్ ఇయర్ ప్రారంభం కాగానే ర్యాంగింగ్‌కు పాల్పడమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించాలి. ఇలా చేయడం వల్ల వెల్‌కమ్ పార్టీల్లో ఉత్సాహంగా పాల్గొనడంతోపాటు జూనియర్, సీనియర్ విద్యార్థులు కలిసిమెలిసి ఉండే అవకాశం ఉంది. అన్ని విభాగాల విద్యార్థులతో ఒక చోట సమావేశాలు ఏర్పాటు చేస్తే వారి మధ్య స్నేహభావం పెరుగుతుంది. విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే ఫిర్యాదు చేసేలా అవగాహన కల్పించాలి. ఇందుకోసం విద్యార్థి కన్వీనర్, స్టాఫ్ కన్వీనర్ దగ్గర ఉన్న సెల్‌ఫోన్ నెంబర్లు 24గంటలపాటు అందుబాటులో ఉంచాలి. ఇబ్బంది పడే విద్యార్థులకు ఈహెల్ప్‌లైన్ నంబర్లకు సమస్యను వివరించమని చెప్పాలి. అలాగే అనుమతి లేకుండా బయటి వ్యక్తులు కాలేజీ లేదా హాస్టళ్లలోకి అనుమతించకూడదు. బాలికలు లేదా విద్యార్థినీలు రాత్రి 9గంటల లోపు వసతిగృహాల్లోకి తప్పనిసరిగా చేరుకునేలా చర్యలు తీసుకోవాలి. కళాశాలకు వచ్చే ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గుర్తింపు కార్డు ధరించాలి. కళాశాల ప్రిన్సిపల్, వార్డెన్ ఆకస్మికంగా విద్యార్థుల వసతిగృహాలను సందర్శించాలి.

## గ్రామ పంచాయితీ సిబ్బందికి వేతనాలు పెంచాలి




ర్యాలీలో పాల్గొన్న సీఐటియూ నేతలు

ధర్నాచౌక్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో అతి తక్కువ వేతనాలు పొందుతున్న అట్టడుగు కార్మికులైన గ్రామ పంచాయితీ సిబ్బందికి వేతనాలు పెంచాలని సీఐటియూ అఖిల భారత కోశాధికారి ఎం.సాయిబాబు, సీఐటియూ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాలడుగు భాస్కర్, చుక్క రాములు డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ గ్రామ పంచాయితీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పాదయాత్ర ముగాంపు సందర్భంగా బాగ్‌లింగంపల్లి నుండి ఇందిరాపార్కు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇందిరాపార్కు వద్ద ఏర్పాటుచేసిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ గ్రామ పంచాయితీ సిబ్బందికి పెండింగ్ లో ఉన్న వేతనాలను తక్షణమే ఇవ్వాలని, జీవో నెంబర్ 51 ని సవరించాలని, నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈనెల 12 నుండి 28 వరకు 350 కిలోమీటర్ల పాద యాత్ర చేపట్టి అది ముగిసేలోగా గ్రామ పంచాయితీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తక్షణమే మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, పంచాయితీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ వంటి అన్ని సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు గ్యార పాండు, ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య, నాయకులు పి.గణపతిరెడ్డి, తునికి మహేష్, పి.వినోద్, సీఐటియూ నేతలు జె.వెంకటేష్, రమ, భూపాల్, జయలక్ష్మి, రాజారావు, మల్లి ఖార్జున్, ఈశ్వర్‌రావు, మధు, శ్రీకాంత్, రమేష్, సోమన్న, రాకేష్ పాల్గొన్నారు.

### రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ ఆర్.జగదీశ్వర్ పదవీ విరమణ

మైలార్‌దేవ్‌పల్లి,ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్.ఆర్.జగదీశ్వర్ మంగళవారం పదవి విరమణ చేశారు.రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ జగదీశ్వర్ దంపతులను రిజిస్ట్రార్ డాక్టర్ సుధీర్ కుమార్,ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.కాగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నూతన పరిశోధన సంచాలకులుగా డాక్టర్.ఎం.వెంకటరమణ నియమిస్తూ విశ్వవిద్యాలయం ఉత్తర్వులు జారీచేసింది.

## భవనంపై నుండి పడి మహిళ మృతి



మృతిచెందిన అంజవ్వ

దుండిగల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : నిర్మాణంలో ఉన్న ఓ భవనంపై నుండి ప్రమాదవశాత్తు పడి మహిళ మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తనుకొండ వెంకటరాములు, అంజవ్వ(38) దంపతులు సూరారంలోని క్రాంతినగర్ లేఅవుట్‌లో నివాసం ఉంటున్నారు. అదే లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఓభవనం వద్ద వెంకటరాములు వాచ్‌మెన్‌గా పని చేస్తుండగా అంజవ్వ కూలీపనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. ఈక్రమంలో మంగళవారం తెల్లవారు జామున ఐదు గంటల ప్రాంతంలో భవనం ఐదవ అంతస్థులో అంజవ్వ నీటిని పడుతుండగా ప్రమాదవశాత్తు పై నుండి కిందపడిపోయింది. తీవ్రగాయాలైన ఆమెను స్థానికంగా ఉన్న వైద్యశాలకు తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందింది. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## నృత్యకళాకారులకు గుర్తింపు కోసం ఏప్రిల్‌లో జాతీయ సదస్సు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: దేవాలయాల్లో భక్తిపూర్వ కమైన నృత్యాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, ఇటు వంటి కళాక్షేత్రాలు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో లేవని, దీనికి వేదికలు ఏర్పాటు చేయాలని తిరుపతి అన్నమయ్య కళాక్షేత్ర పీఠా ధిపతి విజయ శంకర స్వామి, కోవిద సహృదయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు, కళాబంధు, జానపద వృత్తికళాకారుల గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ జి.అనూహ్యారెడ్డి డిమాండ్ చేశారు. ఆయా రంగాలకు చెందిన నృత్య గురువులకు స్టైఫండ్ ఇవ్వాలని, అందరికి గుర్తింపు కార్డులివ్వాలని, వారి పిల్లలకు ఉచితంగా చదువుకోవాలని అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ముఖ్యఅతిథులుగా తిరుపతి అన్నమయ్య కళాక్షేత్ర పీఠాధిపతి విజయ శంకర స్వామి, కోవిద సహృదయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు, కళాబంధు, జానపద వృత్తికళాకారుల గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ జి.అనూహ్యారెడ్డి హాజరై సత్కరించి అభినందించారు. సంప్రదాయ, సాహిత్య సమ్మేళన కార్యక్రమం అద్భుతంగా సాగింది. కథక్, కూచిపూడి, భరతనాట్యానికి సంబంధించిన గురువులను సత్కరించారు.



**ఆకట్టుకున్న" కేరళ సాంప్రదాయ నృత్యాలు"**




కేరళ పర్యాటక సంస్థ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన సాంస్కృతిక కళా ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. సోమాజిగూడలోని ఓ హోటల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేరళ సాంప్రదాయ ప్రదర్శనలు కతకళి, మోహినీ నాట్యం, కత్తిసాము చేశారు. ఈ సందర్భంగా కేరళా ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ సుజీష్‌కుమార్ జ్యోతిప్రజ్వలన చేసికార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కేరళాలో టూరిజం డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ వినూత్నమైన కార్యక్రమాల గూర్చి ఆయన వివరించారు.

## పూర్తిస్థాయి కలెక్టరెప్పుడో..?

హైదరాబాద్ జిల్లాకు ఇన్‌చార్జ్ కలెక్టరే దిక్కు

తొమ్మిది సంవత్సరాల కాలంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్లు 9మంది కొనసాగారు

అందులో ఒకరు ఆంధ్ర క్యాడర్ వెళ్లగా, ఒకరు పదవి విరమణ పొందారు

ప్రస్తుతం ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా కొనసాగుతున్నారు

గోషామహల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత రాష్ట్ర రాజధాని హైదరాబాద్ జిల్లా తొమ్మిది సంవత్సరాల కాలంలో 9మంది మంది కలెక్టర్లు భాద్యతలు నిర్వహించారు. అందులో ఒకరు పదవి విమరణ చేశారు. మరొకరు ఆంధ్ర క్యాడర్‌కు వెళ్లిపోయారు.అటు తరువాత హైదరాబాద్ జిల్లాకు ఏ ఒక కలెక్టర్ ఏడాదిపైగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా కొనసాగలేక పోయారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మొదటి కలెక్టర్ బిఆర్ మీనా కొనసాగిప్పటికి ఆంధ్రా క్యాడర్‌కు వెళ్లిపోయారు. గత ఏడాది క్రితం ఆర్ శర్మన్ పదవి విరమణ చేశారు. అంతకు ముందు కలెక్టర్లుగా రాహుల్‌బొజ్జా, శైలజ, యోగితారాణా, రఘునందన్‌రావు, సుస్మిత సభ్వరాల్, శ్వేతమహంతి, మాణిక్‌రాజ్‌లు జిల్లా కల్టెకర్లుగా కొనసాగారు. శర్మన్ పదవి విరమణ తరువాత మేడ్చల్ జిల్లా కలెక్టర్ కొనసాగిన ఆమోస్‌ను హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా కొనసాగాలని జనవరిమాసంలో రాష్ట్ర వ్యాప్తంగా బదిలైన కలెక్టర్ల జాబితాలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. దాదాపు ఆరు నెలల నుండి హైదరాబాద్ జిల్లాకు పూర్తి స్థాయిలో కలెక్టర్‌ను నియమించక పోవడం శోచనీయం. ఈ మధ్య కాలంలో రాష్ట్ర డిజిపి పదవి విరమణ చేసిన తరువాత నూతన డిజిపి పెద్ద ఎత్తున్న ఐపిఎస్ అధికారులను బదిలీ చేశారు. కాని రాష్ట్ర రాజధానైనా హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌ను పూర్తిస్థాయిలో ఎందుకు నియమించడం లేదని కలెక్టర్ కార్యాలయంలో విధులను నిర్వహించే అధికారులు చర్చించుకుంటున్నారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌ను ఏప్పుడు నియమిస్తారో వేచి చూడాల్సిందే.

## మైనర్లు డ్రైవింగ్ చేయకుండా కట్టడి చేయాలి

**ట్రాఫిక్ ఎసిపి శంకర్‌రాజు**



మధురానగర్ విజ్ఞానజ్యోతి పాఠశాలలో రోడ్డు భద్రత ట్రాఫిక్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ట్రాఫిక్ ఎసిపి జి శంకర్‌రాజు

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త : రోడ్డు ప్రమాదాలను నివారించడంతో పాటు మైనర్లకు డ్రైవింగ్ చేయకుండా తగిన విధంగా కట్టడి చేయాల్సిన భాధ్యత ప్రతి తల్లిదండ్రులకు ఉందని ట్రాఫిక్ ఎసిపి జి శంకర్ రాజు మంగళవారం మధురానగర్‌లోని విజ్ఞానజ్యోతి పాఠశాలలో దాదాపు 135 మంది విద్యార్థిని విద్యార్థులకు రోడ్డురవాణా ట్రాఫిక్‌పై అవగామన కార్యక్రమాన్ని విజ్ఞానజ్యోతి పాఠశాలలో ప్రిన్సిపల్ అరుణకుమారి సహకారంతో నిర్వహించారు. ముఖ్యంగా మైనరులుగా డ్రైవింగ్ చేయవద్దని సిగ్నల్ వద్ద స్టాప్‌లైన్, రాంగ్‌రూట్, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, జీబ్రా క్రాసింగ్, తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నిర్వహించారు. ప్రస్తుత కాలంలోమైనర్‌లే అధికంగా డ్రైవింగ్ చేస్తూ రోడ్లపై ప్రమాదాలకు కారణమవుతున్నారని పోలీసులకు కూడా అధికంగా పట్టుపడుతున్నారని ఇలాంటివి జరుగకుండా తల్లిదండ్రులు ఎప్పటికపుడు వారి వారి పిల్లలను జాగ్రత ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని క్రమశిక్షణ మార్గంలో నడుచుకునేలా చూడాలన్నారు. 18సంవత్సరాల వరకు మైనార్టీ తీరిన తర్వాతే వారికి వాహనాలు నడుపుకునేందుకు తగిన విధంగా అవకాశం ఇవ్వాలే కానీ వారిని ప్రమాదాలకు నిలయంగా మారేలా చూడొద్దన్నారు. ప్రస్తుతం తాము ప్రతి పాఠశాలలో కాలేజీలల్లో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థిని విద్యార్థుల్లో ఈప్రత్యేక కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్నామని మంచి స్పందన లభిస్తుందన్నారు. విద్యార్థులు ట్రాఫిక్ సంబందించిన పలు రకాల సందేహాలను నివృతి చేసుకున్నారు. ఈకార్యక్రమంలో బేగంపేట టిటిఐ సబ్‌ఇన్స్‌పెక్టర్ సిహెచ్ జ్యోతి, హెడ్ కానిస్టేబుల్ శ్యామల, మాజిద్‌ఖాన్, చిరంజీవి, భార్గవి, తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే ఏప్రిల్ నాటికి ఉప్పల్ స్కైవాక్ పూర్తి : కమిషనర్ అరవింద్‌కుమార్



ఉప్పల్ చౌరస్తాలో హెచ్‌ఎండిఏ నిర్మిస్తున్న స్కైవాక్‌ను పరిశీలిస్తున్న హెచ్‌ఎండిఏ కమిషనర్ అరవింద్‌కుమార్ తదితరులు

ఉప్పల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : ఉప్పల్ చౌరస్తాలో అధునాతన హంగులతో నిర్మిస్తున్న స్కైవాక్‌ను వచ్చే ఏప్రిల్ నాటికి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకుని వస్తామని హెచ్‌ఎండిఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ చౌరస్తాలో హెచ్‌ఎండిఏ ఆధ్వర్యంలో రూ.25 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న పలువురు అధికారులతో కలిసి పరిశీలించారు. ఉప్పల్ చౌరస్తాలో అధునాతన హంగులతో స్కైవాక్ నిర్మిస్తున్నామని, 660 మీటర్లతో 9 లిఫ్టులు, మూడు ఎస్కలేటర్లతో దీనిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. మెట్రో రైలు స్టేషన్‌ను అనుసంధానం చేస్తూ పాదచారులకు అనుకూలంగా ఉండే విధంగా స్కైవాక్ తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. స్కైవాక్ నిర్మాణం పూర్తయితే పాదచారులకు ఇబ్బంది లేకుండా ఉంటుందని, మెట్రో స్టేషన్లకు నేరుగా లిఫ్టులు, ఎస్కలేటర్ల సహాయంతో వెళ్లేందుకు వీలు ఉంటుందన్నారు. స్కైవాక్‌లో లైటింగ్, స్ట్రీట్ ఫర్నిచర్ తదితర సదుపాయాలు ఉంటాయని, వచ్చే ఏప్రిల్ నాటికి అందుబాటులోకి తీసుకుని వస్తామన్నారు. ఈసందర్భంగా స్కైవాక్ పైన జరుగుతున్న పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎండిఏ చీఫ్ ఇంజనీర్ బిఎల్ఎన్ రెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్ యూసుప్ హుస్సేన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అప్పారావు, ఎఇ చందు తదితరులు పాల్గొన్నారు.



వరంగల్ మెడికల్ పిజి విద్యార్థిని ప్రీతి మృతికి సంతాపం ప్రకటిస్తూ మంగళవారం సాయంత్రం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న లాలగూడలోని రైల్వే హాస్పిటల్ వైద్యులు, నర్సులు, సిబ్బంది

## భక్తులకు అన్నిరకాల సౌకర్యాలు వసతులు కల్పించే విధంగా గణేష్ ఆలయియం అభివృద్ధి : మంత్రి తలసాని

యూసుప్‌గూడ, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త : భక్తులకు అన్నిరకాల సౌకర్యాలు వసతులు కల్పించే విధంగా గణేష్ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి తలసాని శ్రీనువాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం అమీర్‌పేట డివిజన్ గురుమూర్తి నగర్‌లోని గణేష్ దేవాలయంలో దాతల సహకారంతో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆలయ అబివృద్ధి పనులపై పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఆలయం వెనుక ఉన్న రేకుల షెడ్డు, షాపులను తొలగించి నూతన షాపులు ఆఫీస్‌రూమ్, కిచెన్, టాయ్‌లెట్స్ నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా ఆలయానికి ఆలయ ముఖద్వారానికి పెయింటింగ్‌లు చేయాలని ఆదేశించారు. ఆలయ అభివృద్ధి కోసం అవసరమయిన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈవో నరేందర్‌రెడ్డి, నాయకులు హనుమంతరావు, సంతోష్, ప్రవీన్‌రెడ్డి, అశోక్‌యాదవ్, హరీష్‌సింగ్, ఉమానాథ్‌గౌడ్, శ్రీనువాస్‌యాదవ్, కట్ట బలరామ్, సచిన్‌రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

## పార్కింగ్ చేసి ఉన్న వాహనాలు దగ్ధం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

సైదాబాద్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: పార్కింగ్ చేసి ఉన్న వాహనాలపై గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోలు పోసి నిప్పంటించిన సంఘటన మాదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి మీర్ మజార్ అలీ అబిద్‌కు ముబిన్ కాలనీలో రెండు ఇండ్లు ఉన్నాయి. ఒక ఇంటిలో అతని కుమార్తె ఉంటుంది. సెల్లార్‌లో పార్కింగ్ చేసి ఉన్న వాహనాలపై గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం తెల్లవారుఝామున 4.30 సమయంలో పెట్రోలు పోసి నిప్పంటించారు. దీంతో మూడు ద్విచక్రవాహనాలు, ఒక నానో కారుతో పాటు మరో వాహనం పూర్తిగా దగ్ధమయ్యాయి. జరిగిన ఘటన మొత్తం అక్కడే ఉన్న సిసి కెమరాల్లో రికార్డయినట్లుగా తెలుస్తుంది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

### జనాభా ప్రాతిపదికన రెండు వార్డులను ఎస్సీలకు కేటాయించాలి : సంకి రవిందర్

కంటోన్మెంట్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల్లో భారత రాజ్యాంగ రిజర్వేషన్ల ప్రకారం 8 వార్డులలో 2 నుంచి 3 ఎస్సీ కులాలకు రిజర్వు చేయాల్సి ఉండగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డులోని 8 వార్డులలో ఒకే ఒక్క వార్డును ఎస్సీ వార్డుగా ప్రకటించడం సరైంది కాదని కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవిందర్ తెలిపారు. దేశంలోని 62 కంటోన్మెంట్ బోర్డులలో చాలా చోట్ల 2 నుంచి 3 వార్డులను ఎస్సీ రిజర్వుకు కేటాయించారన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో అత్యధికులు దళితులు ఉండడంవల్లనే కంటోన్మెంట్ అసెంబ్లీని ఎస్సీ నియోజకవర్గంగా 50 యేండ్ల క్రితం నుంచే ప్రకటించడం జరిగిందన్నారు. అయితే స్థానిక బోర్డు ఎన్నికల్లో కూడా 2,3 వార్డులను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## ఆర్టీసీ కాలనీలో సమస్యలన్ని పరిష్కారిస్తాను: ఎమ్మెల్యే


అధికారులతో చర్చిస్తున్న కాలేరు వెంకటేష్

హైదరాబాద్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: కాచిగూడలోని ఆర్టీసీ కాలనీలో ప్రజలు కోరిన విధంగా పారిశుద్ధ్య నిర్వాహణ చేపడతామని, వీధి దీపాలు ఏర్పాటు చేస్తామని అలాగే భారీ వాహనాలు తిరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేస్తామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చెప్పారు. స్థానికంగా ఉన్న కాలేజీలో అసాంఘిక కార్యక్రమాలపై నిఘా ఏర్పాటు చేసి నియంత్రణ చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. మంగళవారం ఆయన ఆర్టీసీ కాలనీలో పాదయాత్ర చేపట్టి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే అక్కడికక్కడే సంబంధిత అధికారులు, పోలీసులతో చర్చలు జరిపి సమస్యలపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. తమ సమస్యలపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యేకు స్థానికులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖాధికారులు, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## కుంగిన రోడ్లు, ఇతర పనులను సమీక్షించిన కార్పోరేటర్


అధికారులతో చర్చిస్తున్న మహాలక్ష్మీరామన్‌గౌడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: ఇటీవల హిమాయత్ నగర్ డివిజన్‌లో కుంగిన రోడ్లును, జరుగుతున్న పనులను డివిజన్ కార్పోరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్ సందర్శించి, పనులను సమీక్షించారు. హిమాయత్‌నగర్‌లోని స్ట్రీట్ నెంబరు 5, 7లలో, చంద్రానగర్, తెలుగు అకాడమీ సమీప ప్రాంతంలో ఆమె పర్యవేక్షించారు. సంబంధిత జిహెచ్ఎంసి, జల మండలి, ఇతర శాఖల అధికారులతో చర్చలు జరిపారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని ఆమె అధికారులను కోరారు. అలాగే చంద్రానగర్‌లో బస్తీ నూతన కమిటి సభ్యులు చెప్పిన విజ్ఞప్తులను ఆమె సావదానంగా విని సమస్యలను పరిష్కారి స్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులతోపాటు, బస్తీవాసులు, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## అటవీశాఖ ఆధ్వర్యంలో వనదర్శిని

శామీర్‌పేట, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త : అటవీశాఖ వారి ఆధ్వర్యంలో వనదర్శిని కార్యక్రమం జరిగింది. శామీర్‌పే దుప్పుల పార్కులో మూడుచింతలపల్లి మండలంలోని కేశ్వాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో వనదర్శిని కార్యక్రమం జరిగింది. శామీర్‌పేట అన్వదా ఫౌండేషన్ ప్రతినిధులు ప్రసాద్, నస్రీన్ పర్యవేక్షణలో అటవీశాఖ శామీర్‌పేట రేంజ్‌లో నిర్వహించారు. ఈ సందర్బంగ వారు పేర్కొంటూ 50మంది విద్యార్థులకు అటవీ గురించి, జంతువుల గురించి వివరించారు.

## ఘనంగా అంతర్జాతీయ టైలర్స్ డే వేడుకలు


టైలర్స్‌డే వేడుకల్లో పాల్గొన్న ఏసిపి వెంకటరమణ, ప్రముఖ హైకోర్టు న్యాయవాది జిఎల్ నరసింహారావు,రచ్చ శ్రీనివాస్

హైదరాబాద్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : అంతర్జాతీయ టైలర్స్ డే వేడుకలు నగరంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం ప్రముఖ సంఘ సేవకుడు టైలర్ రచ్చ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గోల్నాకలోని ఆయన టైలర్ షాపులో నిర్వహించిన ఈ వేడుకల్లో ఏసిపి వెంకటరమణ, ప్రముఖ హైకోర్టు న్యాయవాది జిఎల్ నరసింహారావులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్బంగా టైలర్ మిషన్లకు జరిగిన పూజలో పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్‌చేశారు. ఈ సందర్బంగా ఏసిపి వెంకటరమణ, హైకోర్టు న్యాయవాది జిఎల్ నరసింహారావులు టైలర్లకు శుభాకాంక్షలు తెలిపారు. సేవాభావంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న రచ్చ శ్రీనివాస్‌ను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో టైలర్లు వి.రాజేందర్, విజయ్‌కుమార్, జి.శ్రీనివాస్, బి.ప్రభాకర్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## సుస్థిర పాలన అందించేది కాంగ్రెస్సే: పి విజయారెడ్డి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: ప్రజలకు అండగా ఉంటూ సుస్థిరపాలన అందించేది ఒక్క కాంగ్రెస్ అని టి.పిసిసి ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ పి.విజయారెడ్డి పేర్కొన్నారు. డివిజన్‌ల, ప్రాంతాల, బస్తీల, కాలనీలలో ఆమె 'హాత్ సే హాత్ జోడో' పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచుతూ ఇందిరమ్మ రాజ్యం మళ్లీ వస్తుందంటున్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ చేపట్టిన యాత్ర రెండో విడతలో కూడా ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను నేరుగా చూస్తున్నారని విజయారెడ్డి అన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఇటు పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కూడా విస్తృతంగా ప్రజల మధ్యకు వెళుతున్నారని, అర్హులైన నిరుపేదలకు ఇళ్లు కట్టుకోవడానికి 5 లక్షలు, రైతాంగ సమస్యలు తదితర వంటి వాటికి ఇప్పటికే శ్రీకారం చుట్టారని ఆమె వివరించారు. గరీబ్ హటావో అంటూ కాంగ్రెస్ గతంలో చేసి చూపించిందని ఆ రోజులు మళ్లీ రాబోతున్నాయని విజయారెడ్డి స్పష్టం చేశారు. ఈ పాదయాత్ర కార్యక్రమంలో బస్తీల, కాలనీలకు చెందిన పెద్దలు, మహిళలు, యువత, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు గౌరవప్రదంగా ఆమెను ఘనంగా స్వాగతించారు.

## ప్రజలు మెచ్చే విధంగా సందేశాత్మక చిత్రాలు తీయాలి

సైఫాబాద్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: ప్రపంచం మెచ్చే విధంగా సందేశాత్మక చిత్రాలను నిర్మించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్పోరేషన్ ఛైర్మన్ డా.సముద్రాల వేణు గోపాలాచారి దర్శక నిర్మాతలకు పిలుపునిచ్చారు. సందేశాత్మక చిత్రాలను ప్రజలంతా ఆదరిస్తారని, దీంతో సమాజం కొంతమేరకు అభివృద్ధి చెందుతుందని చెప్పారు. రవీంద్రభారతిలో ప్రాజ్ఞిక ఫౌండేషన్, సిల్‌వెల్ కార్పోరేషన్, కెవిఎల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో యువ నటుడు వంశీ చాగంటికి ప్రముఖ దర్శకుడు కె.విశ్వనాధ్ ప్రతిభా పురస్కారాన్ని ప్రదానం చేసిన సందర్బంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో విశ్వనాధ్‌కు తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని చెప్పారు. విశ్వనాధ్‌లాగా అందరూ సందేశాత్మక చిత్రాలను తీయాలని, నటులు కూడా సందేశాత్మక చిత్రాలకు అధిక ప్రాధాన్యత కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దైవజ్ఞశర్మ, మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి, గాయనీ గాయకులు రమణ, సురేఖమూర్తి, పురుషోత్తంగౌడ్, పారిజాత తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్, నీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి : మహేందర్‌గౌడ్


బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లో విద్యుత్, నీటి ఇబ్బందులపై అధికారులతో చర్చిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

నార్సింగి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో విద్యుత్, నీటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు పని చేయాలని మేయర్ బుర్ర మహేందర్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం కార్పోరేషన్ కార్యాలయంలో కమీషనర్ వేణుగోపాల్‌రెడ్డితో కలిసి విద్యుత్, నీటి ఇబ్బందులపై ప్రజా ప్రతినిదులు, ఆయా శాఖల అధికారులతో చర్చించారు. ఎక్కడెక్కడ కొత్తగా విద్యుత్ స్థంభాలు అవసరం? మూడో వైర్ లాగాలి? కొత్తగా వాటర్ పైప్‌లైన్ పనులు ఎక్కడ వేయాలని వంటి విషయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అధికారులకు తెలిపి వెంటనే వీటిని పరిష్కరించాలని సూచించారు. వేసవి కాలం ప్రారంభమైందని, ఇప్పుడు విద్యుత్, నీరు ప్రజలు ఎక్కువగా వాడుతారని, ఈ రెండు ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాలికలు వేసుకొని విధులు నిర్వహించాలని తెలిపారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆశీర్వాదంతో ఇప్పటి వరకు ప్రజల ఇబ్బందులను వేగంగా పరిష్కరిస్తు వస్తున్నామని, అధికారులు, ప్రజా ప్రతినిధులంతా సహకరించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సమావేశంలో మేనేజర్ రవీందర్‌రెడ్డి, కార్పోరేటర్లు భూపాల్‌గౌడ్, అస్లాం, సాగర్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, రాము, కార్పోరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్, నాయకులు గోపాల్, నాగరాజు, ఖాయాజ, పాండు, టింకు, రజాక్, డిఇ యాదయ్య, ఎఇ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్లార్‌ఐటిఎంలో ఘనంగా సైన్స్‌డే


విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న డా.కెవి.రెడ్డి

దుండిగల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : నగరశివారు దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (ఎమ్మెల్లార్‌ఐటిఎం) కళాశాలలో నేషనల్ సైన్స్‌డే ను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో కళాశాలలోని విద్యార్థులతో పాటు దుండిగల్, గౌడవెల్లి, గుండ్ల పోచంపల్లిలలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని వివిధ సాంకేతిక ఆవిష్కరణలు ప్రదర్శించడం జరిగింది. ప్రధానంగా రోబోటిక్స్ పైన వర్క్‌షాప్ నిర్వహించి పాఠశాలకు విద్యార్థులకు రోబోటిక్స్‌పై అవగాహన కల్పించడంతో పాటు వారితో రోబోలను తయారు చేయించడం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డా.కెవి.రెడ్డి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞాన సదస్సులు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు నూతన ఆవిష్కరణలపై పట్టు లభిస్తుందన్నారు. ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. అదే విధంగా వ్యవసాయంకు ఉపయోగపడే సరికొత్త ఆవిష్కరణలపై దృష్టిసారించాలన్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఇన్నోవేషన్ సెంటర్ ప్రెసిడెంట్ డా.జి.అమర్‌నాథ్, స్టూడెంట్ క్లబ్ కో-ఆర్డినేటర్ డా.నల్లగొండ శ్రీనివాస్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సామాజిక రంగాల్లో ముందు ఉండాలి


టి.మాదిగ హక్కుల దండోరా నూతన అధ్యక్షులుగా నియమితులైన కొంగరి శంకర్‌మాదిగను సన్మానిస్తున్న జాతీయ అధ్యక్షులు దండుసురేందర్ మాదిగ, పి.శ్యామ్‌కుమార్

గోషామహల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: మాదిగల హక్కులతోపాటు సామాజిక రంగాలల్లో ముందు ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా జాతీయ అధ్యక్షులు దండు సురేందర్‌మాదిగ అన్నారు. ఖమ్మంలో జరిగిన మాదిగ హక్కుల దండోరా మూడవ మహాసభలో విద్యార్థి నాయకుడు కొంగరి శంకర్‌మాదిగను తెలంగాణ మాదిగ హక్కుల దండోరా అధ్యక్షులుగా నియమించారు. ఈ మేరకు కొంగరి శంకర్‌మాదిగను పెంజర్లశ్యామ్ కుమార్, పందుల గోపాల్, శ్రీనివాస్, కె.సాయికుమార్‌లు సన్మానించారు.

## కేంద్రమంత్రి జైశంకర్‌కు సన్మానం



బేగంబజార్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: నమో వందే గోమాతరం ఆధ్వర్యంలో కేంద్రమంత్రి జైశంకర్‌కి గోమాత ప్రతిమను బహుకరించారు. గోమాత విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పాలని నమోవందే గోమాతరం ఆధ్వర్యంలో కేంద్రమంత్రి జైశంకర్‌ను కోరారు. ఫోరం ఫర్ ఇంటర్నలిస్ట్ థింకర్స్ ఆధ్వర్యంలో ఇండియన్ జి.20 ప్రెసిడెన్సీ అనే అంశంపై టాక్‌షో నిర్వహించారు. భారతీయ సంస్కృతిలో భాగమైన గోవును ఆరాధించడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నమో వందే గోమాతరం జాతీయ అధ్యక్షులు పెరిక సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అద్దెకారు అక్రమాలపై విచారణ జరిపించాలి

**బిసి యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజ్‌కుమార్**

హైదరాబాద్, ఫిబ్రవరి 28,ప్రభాతవార్త: బిసి అభివృద్ధి శాఖలోని అద్దెకారు అక్రమాలపై విచారణ జరిపించాలని బిసి యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ తంగెళ్లపల్లి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఒప్రకటన విడుదల చేశారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అభివృద్ధిశాఖకు ప్రభుత్వం అద్దె వాహనాన్ని వినియోగించుకోమని కేటాయించగా సదరు అధికారి స్వంత కారు ఉపయోగించుకుంటూ ప్రతినెల కారుకు సంబంధించిన బిల్లులను డ్రాచేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వివిధ రకాల టూర్ల నిమిత్తం అన్ని జిల్లాలకు అద్దె వాహనాలను వినియోగించుకోవాలని ఆదేశించగా.. ఆ అధికారిమాత్రం తన స్వంత వాహనాన్ని వాడుకుం టూ ప్రభుత్వం చెల్లించే డబ్బుతానే పొందుతూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతన్నట్లు ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి దుర్వినియోగపరిచిన సొమ్మును ప్రభుత్వానికి జమకట్టే విధంగా చర్యలు తీసుకోవాలని రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు.

## అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యం

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే ఎక్కడా లేని విధంగా కంటివెలుగు కార్యక్రమాన్ని చేపట్టి అంధత్వ నివారణకు కృషి చేస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ పేర్కొన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ 10వ వార్డుకు సంబంధించి రెండోవిడత కంటివెలుగు 28వ రోజు శిభిరాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ఉర్దూమీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన శిభిరంలో వైద్యులు నే త్ర పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లజోళ్లను అందజేశారు. చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్, వైస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, కౌన్సిలర్ బర్ల శశికళ దేవేందర్‌లతో కలిసి కంటివెలుగు శిభిరాన్ని సందర్శించారు. 18 సంవత్సరాలు పైబడిన వారు కంటి పరీక్షలు చేయించుకొని దృష్టిలోపాలను తీర్చుకోవాలని ఆమె సూచించారు.

## కూకట్‌పల్లిలో కొనసాగుతున్న హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్ర


యాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త : హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్ర 8వ రోజు కూకట్‌పల్లి నియోజకవర్గం ఓల్డ్ బోయిన్‌పల్లిలోని మల్లికార్జున కాలనీ, హెచ్‌ఏఎల్ కాలనీ, ఆర్‌ఆర్ నగర్, గౌరీనగర్లలో కొనసాగింది. ఈ సందర్భంగా పిసిసి సభ్యులు డాక్టర్ సత్యంశ్రీరంగం ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు ఇంటింటికి తిరుగుతూ రాహుల్‌గాంధీ సందేశాన్ని కరపత్రాల ద్వారా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరంగం మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమాన్ని కాంగ్రెస్ పార్టీ నిరంతరం కోరుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి పేద ప్రజలంతా వచ్చే ఎన్నికల్లో సహకరించి కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పిసిసి సెక్రటరీ దండుగుల యాదగిరి, డివిజన్ అధ్యక్షులు నల్లోల రాజేందర్, కూకట్‌పల్లి నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ నాయకులు అరవింద్‌నాయుడు, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి, మహేష్‌యాదవ్, చంద్రమౌళి, అశోక్, అస్లాం, క్రిష్ణారాజ్‌పుత్, మహేందర్, ముఖేందర్, శేఖర్ గజానంద్, జిల్లా శివ, భరత్ పెద్ద సంఖ్యలో నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## సమాజంలో మేరు కులస్థుల సేవలు అమూల్యమైనవి

**బిసి కమిషన్ చైర్మన్ డా.వకుళాభరణం కృష్ణ మోహన్**


కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ డాక్టర్.వకుళాభరణం కృష్ణ మోహన్

చార్మినార్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : సమాజంలో దర్జీ ,మేరు కులస్థుల సేవలు అమూల్యమైనవని తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ డాక్టర్. వకుళాభరణం కృష్ణ మోహన్ అన్నారు. దారుషిఫాలోని మేరు భవనంలో మంగళవారం కోవూరు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ టైలర్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేశారు. కుట్టు మిషన్ సృష్టికర్త విలియమ్ హోవ్ చిత్రపటానికి ఆయన పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మేరు భవనంలో కుట్టు మిషన్ల ఎగ్జిబిషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త సాంకేతికతతో వస్తున్న యంత్రాలను ఖరీదు చేసి వాటి ద్వారా వృత్తి ధరాన్ని ఆచరించి అభివృద్దిలోకి రావాలని కోరారు. దర్జీల విషయంలో ఎదురవుతున్న సమస్యలు, వారికి కావలసిన ప్రయోజనాలు తదితర అంశాలపై బిసి కమిషన్ దృష్టికి లిఖిత పూర్వకంగా నివేదించినచో తాము పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేరు సంఘం రాష్ట్ర అడ్‌హాక్ కమిటి ముఖ్య సలహాదారులు కొవ్వూరు భాస్కర్‌రావు, మేరు ట్రస్ట్ చైర్మన్ పొడిశెట్టి నర్సింగరావు, ప్రతినిధులు అడప వెంకటేశ్వరరావు, దీకొండ నర్సింగరావు, కీర్తి శేఖర్, మాడిశెట్టి లక్ష్మీ నారాయణ, కె.వెంకటేష్, సంఘేవార్, రావి పాపన్న, ఓదెల సత్యనారాయణ, సింగు విష్ణు, కరణాకర్, రమేష్, మాడిశెట్టి తిరుపతి, అధిక సంఖ్యలో మేరు కులస్థులు పాల్గొన్నారు.

## కవితాలోకాన కల్పవల్లి దేవులపల్లి

**ఫిలిం సెన్సార్‌బోర్డు పూర్వ సభ్యుడు, కళాబ్రహ్మ వంశీ రామరాజు**

చిక్కడపల్లి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: కవితాలోకాన కల్పవల్లి దేవులపల్లి కృష్ణశాస్త్రి అని సిబిఐ కోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతిశర్మ అన్నారు. మంగళవారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని సిటీ కల్చరల్ సెంటర్‌లో శోభా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమి అధినేత్రి, ప్రముఖ గాయనీ, వ్యాఖ్యాత్రి శోభారాణి ఆధ్వర్యంలో సుప్రసిద్ధ సాహితీవేత్త దేవులపల్లి కృష్ణశాస్త్రికి స్వరనివాళి కార్యక్రమంలో భాగంగా 'ద్వారానికి తారామణి హారం' పేరుతో సినీ, లలిత, భావ గీతాల సమార్చన కార్యక్రమం శోభారాణి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్బంగా ప్రముఖ గాయనీ, గానకోకిల విన్నకోట దుర్గకు 'దేవులపల్లి-శోభా ఇంటర్నేషనల్ మ్యూజిక్ అవార్డు-2023' ప్రదానం చేసే కార్యక్రమం జరిగింది. గాయనీ గాయకులు విఆర్‌కె.ఫణి, అంబాళం శ్రీకాంత్, వేణుగోపాలచారి, దయాకర్‌రావు, సురేశ్, రాజేంద్రప్రసాద్, దుర్గాసౌజన్య, సరోజ, భాను, ఆర్.లక్ష్మి, కృష్ణజ్యోత్స్న, రమాదేవి, అన్నపూర్ణ, శారద తదితరులు అద్భుతంగా గానం చేశారు. జయంతి సభ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది.

## బిఆర్ఎస్ నాయకుడి భార్య మృతి


అల్లాపూర్ సీనియర్ బిఆర్ఎస్ నాయకులు సయ్యద్‌నజీర్ భార్య మృతి చెందడంతో పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

యూసుఫ్ గూడ, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త : అల్లాపూర్‌లో నివసించే సీనియర్ బిఆర్ యస్ నాయకులు సయ్యద్ నజీర్ భార్య గతకొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమె మృతి పట్ల స్థానికంగా శాసన సభ్యులు మాదవరం కృష్ణారావు, కార్పోరేటర్ సబీహా గౌసుద్దీన్‌లు సయ్యద్ నజీర్ గృహానికి వెళ్ళి ఆయనను పరామర్శించారు. ఆయనతో పాటు నియోజకవర్గం మైనార్టీసెల్ అధ్యక్షులు ఎమ్‌డి గౌసుద్దీన్, మాజీ కార్పోరేటర్ మహ్మద్ షరీఫ్, ఎమ్‌ఏ రహీమ్, అజీమ్ ప్రేమ్‌జీ, లింగాల ఆయిలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## దేశం పెరుగుదలకు పిఆర్ గణనీయంగా కృషి చేసింది: రోహిత్ రాజ్ మాథుర్


చర్చలో పాల్గొన్న పిఆర్‌లు. చిత్రంలో రోహిత్‌రాజ్‌మాథుర్, డి.రామచంద్రం

సైఫాబాద్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: అధునిక భారతదేశం యొక్క పెరుగుదలకు పిఆర్ గణనీయమైన కృషి చేసిందని ఇది ఐటి రంగంలో దేశం యొక్క నైపుణ్యాన్ని బాగా ప్రదర్శించిందని అయాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ఓఎస్‌డి రోహిత్‌రాజ్‌మాథుర్, సోలస్ మీడియా వ్యవస్థాపకుడు డి.రామచంద్రం చెప్పారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్, సెంట్ జోసఫ్ డిగ్రీ అండ్ పిజి కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని ఈ కళాశాల ప్రాంగణంలో జరిగిన 'ట్రెండ్స్ ఇన్ పిఆర్ ఇన్ 2023' అనే అంశంపై జరిగిన చర్చలో వారు ప్రసంగించారు. నేటి ఇంటర్‌నేట్ యుగంలో కూడా ఇప్పటికి కొన్ని పాత నియమాలు మారలేదని కంటెంట్ కింగ్‌గానే ఉన్నదని, కంటెంట్‌లో అసలైన కంటెంట్ కింగ్‌గానే ఉన్నదని తెలిపారు. వైరల్ కీర్తి కోసం నైపుణ్యాలకు డిమాండ్ ఉందని చైనాలోని ఒక డిగ్రీ కళాశాలలో డిగ్రీ కోర్సును అందిస్తున్నదని ఆ కోర్సులో సోషల్ మీడియా సెలెబ్‌గా (ప్రముఖ వ్యక్తిగా) ఎలా మారాలో నేర్పుతుందని చెప్పారు. పిఆర్ నిపుణులు సోషల్ మీడియా నైపుణ్యాలను నేర్చుకోవాలని సూచించారు. టీనేజర్లు స్క్రీనేజర్లుగా మారారని వారు టివి, మొబైల్, టాబ్లెట్, ఓటిటి, ఫిల్మ్, స్మార్ట్ వాచీలు ధరించగలిగే పరికరాల స్క్రీన్లకు కట్టుబడి ఉన్నారని అందువల్ల పిఆర్ నిపుణులు ఈ పరికరాలలో వినియోగించగలిగే కంటెంట్ ను సృష్టించాలని రామచంద్రం చెప్పారు. నేడు టివి రెండోవ స్క్రీన్‌గా మారిందని మొబైల్ ఇప్పటికే టాప్ స్లాట్‌ను ఆక్రమించిందని, మాస్ మీడియా యొక్క వార్తా కథనాలు వాట్సాప్ ఫార్వర్డ్‌లు, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ స్పూఫ్‌లతో పోటి పడవలసి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌ఎస్‌ఐ హైదరాబాద్ ఛైర్మన్ డా.ఎస్.రాము, కార్యదర్శి యాదగిరి కంభంపాటి, అరుణ రాజన్స్ తదితరులు పాల్గొన్నారు. ఈ చర్చలో మొత్తం 70 మంది పిఆర్‌లు పాల్గొన్నారు.

## వృద్దుల పట్ల ప్రభుత్వం సానుభూతితో ముందుకు సాగుతుంది

**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి**



సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: వృద్దుల పట్ల ప్రభుత్వం సానుభూతితో సమస్యలను పరిష్కరించే విధంగా తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పేర్కొన్నారు. ఐఏఎస్ ఆఫీసర్స్ ఇన్టిట్యూట్‌లో ఆల్ ఇండియ సర్వీసెస్ పెన్షనర్స్ అసోసియేషన్ ఫర్ తెలంగాణ అండ్ ఆంధ్రప్రదేశ్(ఎఐఎస్‌పిఏ) వార్షిక సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా శాంతికుమారి హాజరై ప్రసంగించారు. అంతకుముందు అసోసియేషన్ అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఎం.గోపాలకృష్ణ మాట్లాడుతూ వైద్యఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శిగా ఉన్న సమయంలో ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను మెరుగుపర్చడంలో శాంతికుమారి ఎంతో విలువైన సేవలను అందించారని ప్రశంసించారు. ప్రధానంగా వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటులో కీలకపాత్ర పోషించారని, వాక్సినేషన్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడానికి తెలంగాణ రాష్ట్రంలోని వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ఆదర్శప్రాయమైన సేవలను అందించారన్నారు. నిమ్స్‌లో ఫించన్‌దారులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని ఆమెకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ జి.సతీష్‌రెడి 'ఎముక గాయాలు, నివారణలు' అంశంపై ప్రసంగించగా, ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ ఎం.మురళీధర్ వృద్దులకు నివారణ, మెరుగైన చికిత్స, సంరక్షణ అంశంపై సలహాలను అందించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎం.గోనెల తదితరులతో పాటు ఐఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ రిటైర్డ్ అధికారులు పాల్గొన్నారు. గత మూడు సంవత్సరాలుగా సర్వసభ్య సమావేశం జరగలేదు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఐఎస్ అధికారి జి.సుధీర్ ఆరోగ్య సర్వీసెస్‌కు సంబంధించి సమర్పించిన నివేదికను సమావేశం ఆమోదించింది. ఈ సమావేశంలో అసోసియేషన్ కోశాధికారి విఎన్.విష్ణు, ఉపాధ్యక్షులు రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఎం.రతన్, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి డాక్టర్ ఎం.బుల్లయ్య, సంయుక్త కార్యదర్శి రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఎస్.ఉమాపతి, కార్యవర్గసభ్యులు రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు డాక్టర్ వి.రామన్‌రావు, కె.ఉమాపతి, జిఎన్.రావు, ఐపీఎస్ అధికారి జి.రామచంద్రారెడ్డి, ఐఎఫ్ఎస్ అధికారి మహ్మద్ అబ్దుల్ వాహీద్ పాల్గొన్నారు.

## శాస్త్ర విజ్ఞానాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన శాస్త్రవేత్త సి.వి.రామన్ : ప్రభుత్వవిప్ గాంధీ


జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వవిప్ గాంధీ

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త : భారతీయ శాస్త్ర విజ్ఞానాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప శాస్త్రవేత్త, నోబెల్ గ్రహీత సి.వి.రామన్ అని ప్రభుత్వవిప్ అరికెపూడి గాంధీ కొనియాడారు. రామన్ ఎఫెక్ట్ కనుగొన్న సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతీ ఏటా ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం జరుపుకుంటున్న నేపథ్యంలో మంగళవారం వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ కాలనీలో గల శ్రీ చైతన్య పాఠశాలలో నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శనను కార్పోరేటర్ మాధవరం రోజాదేవి రంగారావుతో కలిసి అరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజ్ఞాన ప్రదర్శన విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి వారి ప్రతిభకు పదును పెట్టాడానికి ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. విద్యార్థులు చేసిన సాంకేతిక, సాంస్కృతిక, పర్యావరణ ప్రాజెక్టులను తిలకించి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి ఎంతగానో మెచ్చుకున్నారు. ప్రదర్శనకు విచ్చేసిన తల్లిదండ్రులు, విద్యార్తులు చేసిన ప్రాజెక్టులను చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షులు సంజీవరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కాశినాథ్‌యాదవ్, చంద్రమోహన్ సాగర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో బిఆర్ఎస్ సర్కార్ ఆటలు ఇక చెల్లవు : ప్రకాష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాష్‌రెడ్డి తదితరులు

**తుర్కయంజాల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బిఆర్ఎస్ సర్కార్‌కు చివరి రోజులని మళ్లీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని బిజెపి రాష్ట్ర కార్యదర్శి కె.ప్రకాశ్‌రెడ్డి అన్నారు ప్రజాగోస బిజెపి భరోసాలో భాగంగా తుర్కయంజాల్ మున్సిపాలిటీలో 229, 230, 231 బూత్‌లలో శక్తి కేంద్రం ఇంచార్జ్ రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చాఅధ్యక్షులు బచ్చిగల రమేష్‌అధ్యక్షతన జరిగిన కార్నర్ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని పూర్తిగా అప్పుల్లోకి నెట్టేసిన బిఆర్ఎస్ సర్కార్‌కు రాబోయే ఎన్నికల్లో జనం బుద్ధి చెప్తారని అన్నారు. త్యాగాల ఫలితంగా తెలంగాణ సాధించుకుంటే కేసీఆర్ కుటుంబం మాత్రమే లబ్ధి పొందడం జరిగిందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు తప్పకుండా రాష్ట్రంలో బిజెపికి పట్టం కట్టాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు తూళ్ళనరసింహగౌడ్, నాయకులు కొత్త రామ్‌రెడ్డి, కొండ్రు పురుషోత్తం, సానం అంజయ్య, పలుస శ్రవణ్‌కుమార్‌గౌడ్, కౌన్సిలర్ శ్రీలత అనిల్‌కుమార్, మైలారం బాబు, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిత్యజీవితంలో యోగ సాధన అవసరం : మంత్రి సబితారెడ్డి



మంత్రి సబితకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న రఘు గురుజీ

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** నిత్యజీవితంలో యోగాసాధన అవసరమని తద్వారా ఆరోగ్యకరమైన జీవితం ఉంటుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. ధ్యాన ఫౌండేషన్ ఆధ్యాత్మిక యోగ ప్రచార సంస్థ ప్రత్యక్ష, ఆన్‌లైన్ యోగ శిక్షణా తరగతులను ఉచితంగా ధ్యాన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రఘుగురూజీ నేతృత్వంలో 5వ వార్షికోత్సవ వేడుకల్ని చంపాపేట్‌లోని మంద యాదవ రెడ్డి గార్డెన్‌లో మార్చి 5వ తేదీన జరిగే ఆహ్వాన పత్రికను మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా యోగా గురువు రఘుగురూజీ మాట్లాడుతూ వార్షికోత్సవ వేడుకలకు తెలుగు రాష్ట్రాలనుండి వందలాదిమంది ధ్యాన ఫౌండేషన్ సాధకులు, ఆధ్యాత్మికవేత్తలు హాజరవుతున్నారని తెలిపారు. నిత్య జీవితంలో యోగసాధన్ని ఏ విధంగా మార్చుకోవాలి, శారీరక రుగ్మతలను నివారించుకొని మానసికంగా ఆనందంగా జీవించడానికి యోగా ఉపయోగపడుతుందన్నారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమానికి హాజరై ధ్యాన జ్ఞానయోగ సాధనలో ఉన్నతిని సాధించే అవకాశాలు ఉపయోగించుకోగలరు.

## గాయత్రినగర్ బ్రిలియంట్‌లో అబ్బురపర్చిన వైజ్ఞానిక ప్రదర్శన



ప్రదర్శనలను తిలకిస్తున్న ప్రిన్సిపల్ నీరజ తదితరులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** విద్యార్థులలో దాగి వున్న ప్రతిభను వెలికి తీసేందుకు ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్ ప్రిన్సిపల్ నీరజ పేర్కొన్నారు. జాతీయ వైజ్ఞానిక దినోత్సవం సందర్భంగా మంగళవారం గాయత్రినగర్ బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్లో సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ నీరజ, రతన్‌తో కలిసి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే విషయాలపై తాము అవగాహన పెంపొందిస్తున్నామన్నారు. మానవ శరీర నిర్మాణం, శరీర భాగాలు, అగ్ని పర్వతం, హైడ్రాలిక్ ప్రెషర్, ఎలక్ట్రిక్ లిఫ్ట్ మోడల్, సోలార్ పవర్ ఇరిగేషన్ సిస్టం ప్రాజెక్ట్, వాటర్ ప్యూరిఫికేషన్, గ్రీన్ హౌస్ ఎఫెక్ట్, తదితర నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న శ్రీ త్రివేణి వైజ్ఞానిక ప్రదర్శన



ఎగ్జిబిట్స్‌ను తిలకిస్తున్న పాఠశాల డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి

**సైదాబాద్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా చంపాపేటలోని శ్రీ త్రివేణి పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫేర్ చిన్నారుల్లోని వైజ్ఞానిక ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది. దాదాపు 250కు పైగా ఎగ్జిబిట్స్‌ను విద్యార్థులు తయారు చేసి వాటి గురించి వివరించిన తీరు అందరిని ఆకట్టుకుంది. వైజ్ఞానిక ప్రదర్శనలో భువన విజయం, సోషల్ నెట్ వర్కింగ్ సైట్స్, వివిధ రకాల ఆర్ట్స్, పెయింటింగ్స్ చూపరులను కట్టి పడేశాయి. సేవ్ సాయిల్, ఆర్గానిక్ ఫార్మింగ్, హైడ్రాలిక్ క్రేన్, వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, అగ్రికల్చరల్ ఫార్మింగ్, రోబోట్ వర్కింగ్ మోడల్, సోలార్ సిస్టం, వర్టికల్ ఫార్మింగ్ తదితర ఎగ్జిబిట్స్ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఆహార పదార్థాలన్ని నేడు రసాయిక విషపదార్థాలుగా మారుతున్న తరుణంలో ఆర్గానిక్ ఫార్మింగ్, సేవ్ సాయిల్ అంశాల గురించి విద్యార్థులు వివరించిన తీరు అందరిని అబ్బురపరిచింది. పాఠశాల డైరెక్టర్ కె.గోవర్ధన్‌రెడ్డి ఎగ్జిబిట్స్ అన్నింటిని తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శారద, వైస్ ప్రిన్సిపాల్ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను త్వరగా ప్రారంభించాలి: శ్రీవాణి



మేయర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** డివిజన్లో మంజూరైన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ కుమార్ కోరారు. మేయర్ విజయలక్ష్మిని సోమవారం కలిసి డివిజన్‌సమస్యలపై చర్చించి, పెండింగ్‌లో ఉన్న మంజూరైన విజయపురికాలనీలోని పనులు ప్రారంభమయ్యే విధంగా ఆదేశాలు జారీ చేయాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూజీడి పైప్‌లైన్ పనులు, కమ్యూనిటీ హాల్స్ మరమ్మత్తులు, రోడ్ల మరమ్మతులు వేగవంతం చేయాలని. ప్రజాసంక్షేమం కోసం కొత్త అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని మేయర్‌ను కోరామన్నారు.

## మీర్‌పేట్‌లో బిజెపి శక్తికేంద్రం సమావేశం



శక్తి కేంద్రం సమావేశంలో మాట్లాడుతున్న ఇంఛార్జి బిక్షపతిచారి

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 27వడివిజన్ కార్పొరేటర్, బిజెపి శక్తికేంద్రం ఇంఛార్జి పసునూరి బిక్షపతిచారి ఆధ్వర్యంలో డివిజన్‌లో స్ట్రీట్ కార్నర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ పార్టీ ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశనం చేశారు. ఈ కార్యక్రమంలో పెండ్యాల నర్సింహ, కీసర గోవర్ధన్‌రెడ్డి, కోడూరు సోమేశ్వర్, గాజుల మధు, భీమ్‌రాజ్, కీసర జమున కృష్ణారెడ్డి, పద్మ నర్సింహయాదవ్, సూల ప్రభాకర్, రాజశేఖర్, గోలి శ్రీనివాస్‌లతో పాటు నరేందర్‌గౌడ్, రుద్ర వెంకటేశ్, మలోజు బాలచారి, రామన్న, మల్లేష్, చందు, గోపాల్, శివకుమారచారి, రమేష్, దేవానంద్, శ్రీనివాస్‌చారి, మధు, రామచారి, రాము, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## గృహిణిలు ఆరోగ్యం ఉంటేనే కుటుంబం ఆనందం: కార్పొరేటర్ విజయలక్ష్మి రాజు

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** ఆరోగ్యంపట్ల గృహిణిలు అవగాహన పెంపొందించుకోవాలని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 31వ డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి రాజు కోరారు. లియో కేర్ ఫౌండేషన్, కార్పొరేటర్ సంయుక్త ఆధ్వర్యంలో మీర్‌పేట్ లెనిన్‌నగర్ సమీపంలోని మహిళా సమాఖ్య భవనంలో మహిళల స్వయం ఉపాధి కోసం కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాలు సంతోషంగా ఉంటాయన్నారు. ప్రతి మహిళ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఛైర్మన్ లత, వైస్ ఛైర్మన్ జ్యోతి, భారతి, డాక్టర్ కళ్యాణి, పలువురు మహిళలు పాల్గొన్నారు.

## వీధి కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలి: సానిటరీ ఇన్‌స్పెక్టర్

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** వీధి కుక్కల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ సానిటరీ ఇన్స్‌పెక్టర్ వంకాయల యాదగిరి సూచించారు. మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, కమీషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం బడంగ్‌పేట్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వీధి కుక్కలనుండి రక్షణపై సానిటరీ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్‌లో ఎక్కడైనా వీధి కుక్కల బెడద ఉన్నట్లయితే కార్పొరేషన్ దృష్టికి తీసుకురావాలని అన్నారు. వీధి కుక్కల నియంత్రణకు కార్పొరేషన్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అర్జున్, కో-ఆర్డినేటర్ దేవేందర్, సానిటేషన్ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలి: కార్పొరేటర్ పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** వీధి కుక్కల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఉపకమిషనర్ హరికృష్ణయ్య, కొత్త పేటడివిజన్ కార్పొరేటర్ పవన్‌కుమార్ సూచించారు. కొత్త పేట ప్రభుత్వ పాఠశాలలో జిహెచ్‌ఎంసి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు వీధి కుక్కలపైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీధి కుక్కలనుంచి పారిపోవద్దని, తల్లితో ఉన్న కుక్కలను తరిమికొట్టడంవంటి పనులు చేయవద్దని సూచించారు. వీధి కుక్కలకు ఆహారం, తాగునీరు జన సంచారం లేనిప్రాంతాల్లో పెట్టాలని, వేసవిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాలనీలలో ఎక్కువగా కుక్కలు వుంటే 040-21111111 ఈ నంబర్‌కి సంప్రదించాలని కోరా రు. అదే విధంగా పాఠశాలలో నిర్వహించిన సైన్స్‌ఫెయిర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధా నోపాధ్యాయుడు శ్రీనివాసులు, డిఈ నీలిమ, నాయకులు యూ.రామకృష్ణ, కొత్త తిరుమల్, గట్టు మహేష్, ప్రేమ్, శరణ్ పాల్గొన్నారు.

## ప్రీతి ఆత్మశాంతికి కొవ్వొత్తుల ప్రదర్శన : నీలారవినాయక్

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** సీనియర్ ర్యాగింగ్‌ను భరించలేక ఆత్మహత్య చేసుకున్న మెడికో ప్రీతి ఆత్మ శాంతి కోసం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ రాత్లావత్ నీలా రవినాయక్ ఆధ్వర్యంలో బాలాపూర్ చౌరస్తాలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నీల మాట్లాడుతూ ప్రీతి మృతికి కారణమైన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కరుణానిధి,పార్టీ ప్రధాన కార్యదర్శి గాజుల మధు, చవ్వ శ్రవణ్, తిరుపతిరెడ్డి, స్వామి, రాఘవేందర్‌గౌడ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానానికి 'జల ప్రసాదము ప్లాంట్' బహూకరణ



జల ప్రసాదము ప్లాంట్ వద్ద పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**సైదాబాద్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానానికి 'జల ప్రసాద ప్లాంట్'ను రాజు వేగ్నేష ఫౌండేషన్ అందజేసింది. ఫౌండేషన్ ఛైర్మన్ కోటి రాజు సతీమణి బాల సరస్వతి దేవాలయానికి వచ్చి స్వామి వారికి పూజలు నిర్వహించిన అనంతరం జల ప్రసాదము ప్లాంట్‌ను దేవాలయానికి అందజేశారు. దేవాలయానికి ఇ హుండి ద్వారా విరాళాలు అందించడానికి ఏర్పాటు చేసిన యు.పి.ఐ స్కానర్‌ను దేవాలయ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసశర్మ, ఛైర్మన్ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్‌లు ధర్మకర్తలతో కలిసి ఆవిష్కరించారు. దేవాలయంలో అర్చకులుగా విధులు నిర్వర్తిస్తున్న చంద్రమా ప్రసాద్ వయస్సు రీత్యా మంగళవారం ఉద్యోగ విరమణ చేయడంతో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు ఛాతిరి అఖిల మధుసాగర్, చేగోని మల్లేష్‌గౌడ్, చలమల యాదిరెడ్డి, మొరిశెట్టి శ్రీనివాస్, దేవరపల్లి వెంకట్‌రెడ్డి, సిహెచ్ అనిత, పద్మాల శంకర్, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు : శ్రీనివాస్ ప్రభు



గుండె పనితీరు ప్రదర్శన వివరిస్తున్న విద్యార్థులు

**కుషాయిగూడ, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** విద్యార్థులలో దాగివున్న ప్రతిభాపాటవాలను వెలికితీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని శ్రీ చైతన్య సీబీఎస్సీ పాఠశాలప్రిన్సిపల్ శ్రీనివాస ప్రభు పేర్కొన్నారు. కాప్రాసర్కిల్ పరిధిలోని ఈసీఐఎల్ చౌరస్తాలో గల చైతన్య పాఠశాలలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో ఆదిమూలం అక్షయ పల్లె స్వతహాగా తయారుచేసిన గుండె పనితీరు ప్రదర్శన అందరిని ఆకర్షించింది. వీరు తయారు చేసిన ప్రదర్శన పట్ల ఉపాధ్యాయులు పేరెంట్స్ విద్యార్థులు సైతం ఆనందం వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థిలో ఏదో రకమైన కళ నైపుణ్యం దాగి ఉంటుందని అట్టికలను వెలికితీయడానికి ఉపాధ్యాయులు ఆయా కళ ప్రతిభావంతులను గుర్తించి వారిని ప్రోత్సహించే ప్రయత్నం చేయడాన్ని సైతం అభినందించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కరాటే ఛాంపియన్ షిప్ పోస్టర్ ఆవిష్కరణ : కార్పొరేటర్ అరుణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డి.కె.అరుణ, కార్పొరేటర్ అరుణ

**సైదాబాద్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** తెలంగాణా ఓపెన్ స్టేట్ లెవల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్(ఖేలో భారత్) కరాటే ఛాంపియన్ షిప్ టోర్నమెంట్స్ పోస్టర్‌ను బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డి.కె.అరుణ మంగళవారం సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్, ఛాంపియన్ షిప్ నిర్వాహకురాలు కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డికె అరుణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించడానికి అనేక కార్యక్రమాలను చేపడుతుందన్నారు. క్రీడాకారుల్లోని నైపుణ్యాలను మరింత మెరుగుపరిచేలా కేంద్రం ప్రోత్సాహమందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలను పట్టించుకోరా..? : కాంగ్రెస్



సమస్యలను అధికారులకు విన్నవిస్తున్న పరమేశ్వర్‌రెడ్డి

**ఉప్పల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై అధికార పార్టీ నేతలకు పట్టింపులేదని కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు మందముల్ల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని పలు డివిజన్లలో చేపట్టిన జోడో యాత్రలో గుర్తించిన సమస్యలను మంగళవారం మున్సిపల్, జలమండలి అధికారుల దృష్టికి తీసుకుని వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ బ్లాక్ పరిధిలోని పలుకాలనీలో డ్రైనేజీ, మంచినీటి, డ్రైనేజీ, వీధిదీపాలు, వీధి కుక్కలు తదితర సమస్యలు గుర్తించినట్లు తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికార పార్టీ నేతలు పూర్తిగా విఫలం అయ్యారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా డిసి అరుణ కుమారి, జలమండలి జీఎం సంతోష్‌కుమార్‌లకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రతినిధి ఎం.డి.తౌఫిక్, సీనియర్ నాయకులు బోరంపేట కృష్ణ, చెన్‌రెడ్డి రఘపతిరెడ్డి, తవిడబోయిన గిరిబాబు, గడ్డం లక్ష్మారెడ్డి, సుర్వీ మురళీగౌడ్, ఆగంరెడ్డి, లుకాస్, మంచాల రఘు, ఎం.డి.షఫీ, డివిజన్ అధ్యక్షులు కొంపల్లి బాలరాజు, బాకారం లక్ష్మణ్, పల్లె రమేష్, మహిళా అధ్యక్షురాలు అమరేశ్వరి, పల్లె రఘు, నవీన్ యాదవ్, అకారపు అరుణ్, తుమ్మల దేవిరెడ్డి, గణేష్, సల్ల ప్రభాకర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, పాలడుగు లక్ష్మణ్, రాఘవేంద్ర, హనుమంతు, మంద సుమన్‌రెడ్డి, అమర్, భాస్కర్, సందీప్, కన్నమైన నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రీతినాయక్ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

**హయత్‌నగర్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని... మహిళల రక్షణకు చర్యలు తీసుకుంటున్నామని పాలకులు చెబుతున్న మాటలు నీటి మూటలుగా మిగిలిపోతున్నాయని దళిత సంఘాల ఐక్యవేదికప్రతినిధులు పారందస్వామి, ఏర్పుల నర్సింహ, ఎర్ర రవీందర్ అన్నారు. ప్రీతినాయక్ మరణానికి నిరసనగా... ఆమె ఆత్మశాంతి కోసం దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన, కొవ్వొత్తుల ర్యాలి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రేమపేరుతో డా.దరవాత్ ప్రీతినాయక్‌ను ర్యాగింగ్ చేసి ఆమె మరణానికి కారణమైన సైఫ్, అతని స్నేహితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సైఫ్‌కు ప్రభుత్వంలోని పెద్దల అండ ఉన్నట్లు తెలుస్తోందని నిందితులపై చర్యలకు ప్రభుత్వం వెనుకడవద్దని సూచించారు. నిందితులను ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ వర్గాల మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, ప్రభుత్వం పటిష్ట చట్టాలను తీసుకువచ్చి నేరం చేయాలంటేనే భయపడే పరిస్థితి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లయ్య, రాజ్‌కుమార్, వెంకటేష్, రమేష్, బిక్షపతి పాల్గొన్నారు.

## వైద్య ఖర్చులకు నగదు వితరణ



చెక్కు అందజేస్తున్న చిలుక ఉపేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** ఆర్కేపురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన ఒరుగంటి రవి అనారోగ్యంతో ఉండడంతో అతనికి తాము అండగానిలిచామని యువజన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు. పక్షపాతం వచ్చి దాని వల్ల కంటికి సంబంధించి అనారోగ్యంతో బాధపడుతున్న రవికి విద్యా ఖర్చుల నిమిత్తం మంగళవారం తన నివాసంలో రూ.10వేల ఆర్థిక సహాయాన్ని ఉపేందర్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దవూర సైదులు, కళ్యాణ్, వంగాల శ్రీకాంత్ రెడ్డి, జహంగీర్, అనుదీప్, విజయ్, మాచర్ల వరుణ్, రాంబాబు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## లార్డ్స్‌లో ఘనంగా సైన్స్ దినోత్సవం



ఎగ్జిబిట్స్‌ను పరిశీలిస్తున్న లార్డ్స్ ఛైర్మన్ సిద్దాల బీరప్ప

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని లార్డ్స్ పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు చక్కని ప్రతిభ చాటి వివిధ అంశాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లార్డ్స్ గ్రూపు విద్యా సంస్థల ఛైర్మన్ సిద్దాల బీరప్ప విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్స్‌ను తిలకించి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ బి.శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ శ్రీలత, ప్రిన్సిపాల్ సతీష్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిజెపి కార్నర్ మీటింగ్‌లకు అద్భుత స్పందన: లింగాల హరిగౌడ్

**సైదాబాద్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ ఎస్‌బిహెచ్ కాలనీలో సోమవారం సాయంత్రం ప్రజాగోస-బిజెపి భరోసా కార్నర్ మీటింగ్‌ను నిర్వహించారు. బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడు అశోక్ వేముల, ఓబిసి మోర్చా అధి కార ప్రతినిధి లింగాల హరిగౌడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓబిసి మోర్చా అధి కార ప్రతినిధి లింగాల హరిగౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బిజెపి నిర్వహిస్తున్న కార్నర్‌మీటింగ్‌లకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుందన్నారు. బిఆర్ఎస్ పార్టీ అనుసరిస్తున్న నిరంకుశ, నియంతృత్వ పోకడలతో ప్రజలు విసిగిపోయిఉన్నారని, రాబోయేఎన్నికల్లో బిఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ప్రపంచ దేశాలన్ని భారతదేశం వైపు, ప్రధాని నరేంద్రమోడి వైపు చూస్తున్నాయని, ఇది ప్రతి భారతీయుడు గర్వించదగిన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట కన్వీనర్ నవీన్‌రెడ్డి, నవీన్, నాగరాజు, విష్ణు, వినయ్, ప్రతీక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రీతి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి:

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** మెడికో ప్రీతి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 16వ డివిజన్ కార్పొరేటర్ ఎర్ర మహేశ్వరి జైహింద్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ర్యాగింగ్‌పై ఉక్కుపాదం మోపడానికి కొత్త చట్టాలను తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. రాష్ట్రంలో ర్యాగింగ్, డ్రగ్స్‌లకు విద్యార్థులు బలి అవుతుండడం ఆందోళనకరమైన అంశమని ఆమె తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వం వీటిపై సరైన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ప్రీతి ఆత్మహత్యలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

## జల్‌పల్లిలో ఆయుష్మాన్ భవ కార్డుల పంపిణి

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని జల్‌పల్లి మున్సిపాలిటీలో స్థానిక కౌన్సిలర్ బుడమాల యాదగిరి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భవ ఆరోగ్య భీమా పథకం కార్డుల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ కార్డుల పంపిణీని ప్రారంభించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు, అనుబంధ శ్రేణుల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే తన ధ్యేయం : ఎమ్మెల్సీ నారాయణరెడ్డి



లబ్దిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్సీ నారాయణరెడ్డి

**మలక్‌పేట, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** ప్రజా సంక్షేమమే తమ ధ్యేయమని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. మలక్‌పేటలోని ఎమ్మెల్సీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం కెసిఆర్ రాష్ట్ర ప్రజల ఆరోగ్య సంరక్షణకోసం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, ప్రతి ప్రాంతంలో బస్తీ దవాఖానను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలను అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతిఒక్కరికి కార్పొరేట్ స్థాయి అందించాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. సిఎం సహాయనిధి పేదలకు వరమని, పేదలకు అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వీధి కుక్కల బెడదపై చిన్నారులకు అవగాహన



వీధి కుక్కల బెడదపై అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత, డిసి అరుణకుమారి తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** వీధి కుక్కల బెడద, నివారణపై మంగళవారం చిలుకానగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగహన కల్పించారు. కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, డిసి అరుణకుమారి, డిఇ చందన, వెటర్నరీ ఆఫీసర్ డా.జివ్యనాయక్ తదితరుల ఆధ్వర్యంలో విద్యార్థులకు వీధి కుక్కల బారి నుంచి రక్షించుకునేందుకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, డిసి అరుణకుమారి మాట్లాడుతూ విద్యార్థులు వీధి కుక్కల నుంచి పారిపోవద్దని, తల్లితో ఉన్న కుక్కలను తరిమికొట్టడంవంటి పనులు చేయవద్దని సూచించారు. వీధి కుక్కలకు ఆహారం, తాగునీరు జన సంచారం లేనిప్రాంతాల్లో పెట్టాలని, వేసవిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డా.జివ్యనాయక్ మాట్లాడుతూ ఉప్పల్ సర్కిల్‌లో వీధికుక్కల నివారణకు డాగ్‌స్క్వాడ్ ఏర్పాటు చేశామని, వీధికుక్కలు ఉంటే వెంటనే జిహెచ్‌ఎంసి టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని, వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసి కొంతవరకు అరికడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాయుడు, టిఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఏదుల కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపితోనే అభివృద్ధి సాధ్యం : కార్పొరేటర్ భాగ్యలక్ష్మి



బిజెపి కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** బిజెపితోనే అభివృద్ధి సాధ్యమని మూసారాంబాగ్‌డివిజన్ కార్పొరేటర్ బొక్కా భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. ప్రజా గోస బిజెపి భరోసా కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లోని గడ్డిఅన్నారం రెడ్డిబస్తీలో జరిగిన కార్నర్‌మీటింగ్‌కు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడు తూ ప్రధాని మోడి దేశాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. దేశ ప్రజల అభ్యున్నతికోసం మోడి పలు సం క్షేమ పథకాలను ప్రవేశపెట్టరని తెలిపారు. మోసపూరితమైన మాటలతో మభ్యపెడుతున్న బిఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ది చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు గౌర విజయ్‌కాంత్, కొప్పుల దినేష్, బొక్కా మదుసూదన్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, లక్ష్మారెడ్డి, జీవన్, బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకోవాలి: ఎసిపి రాందాస్ తేజ



రాందాస్ తేజకు జ్ఞాపికను అందజేస్తున్న ఛైర్మన్ కెవిఆర్‌మూర్తి

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని ఉన్నత శిఖరాలకు బాటలు వేసుకోవాలని అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ రాందాస్ తేజ పిలుపునిచ్చారు. మీర్‌పేట్ కార్పొరేషన్ గాయత్రీనగర్‌లోనున్న మెగా సిటీ గ్రామర్ హై స్కూల్ 16వ వార్షికోత్సవం కర్మన్‌ఘాట్ రింగ్‌రోడ్డులోని వంగ అనంతరెడ్డి గార్డెన్స్‌లో కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మన్ కెవిఆర్ మూర్తి, కరస్పాండెంట్ కె.లక్ష్మీ సంధ్యామూర్తి, ప్రధాన కార్యదర్శి ప్రియాంక మూర్తిల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన రాందాస్ తేజ జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ఒత్తిడి జయిస్తూ విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదివి మంచి పేరు సంపాదించుకోవాలన్నారు. కాగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఛార్టెడ్ ఇంజనీర్ ఎలక్ట్రిసిటీ రాబిన్ జేమ్స్, ట్రెస్మా రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్‌రావు, కార్పొరేటర్లు మద్ది సబితా రాజశేఖర్‌రెడ్డి, కొండ్రు గౌరిశంకర్‌తో పాటు మధు, గొంగడి శ్రీను, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.